రేపు అరుణోదయ రాష్ట్ర సదస్సు

ముషీరాబాద్: దేశంలో మోదీ ప్రభుత్వం 11 ఏళ్లుగా ప్రజా సమస్యలను పక్కన పెట్టి కార్పొరేట్ కంపెనీలు, పెట్టుబడిదారులకు ప్రజా సంపద దోచిపెట్టే పనిలో ఉందని అరుణోదయ హైదరాబాద్ రంగారెడ్డి జిల్లాల అధ్యక్షురాలు కోలా స్వప్న అన్నారు. ఆదివాసులను తరిమేసి అడవుల్లోని ఖనిజ సంపదను కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టే ప్రయత్నంలో భాగంగా ఆపరేషన్ కగార్‌ను కొనసాగిస్తోందని అన్నారు. అమాయక గిరిజనులను ఎన్‌కౌంటర్ పేరుతో చంపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గిరిజనుల హక్కుల కోసం జరిగే పోరాటంలో భాగంగా జులై 19న ఇల్లందులో అరుణోదయ రాష్ట్ర సదస్సు నిర్వహిస్తున్నామని తెలిపారు. 'రాజ్యాంగ హక్కులను కాపాడుకోవాలి'అనే నినాదంతో అరుణోదయ సంస్కృతిక సమైక్య ఆధ్వర్యంలో జరిగే సదస్సును జయప్రదం చేయాలని కోరారు. కవులు, కళాకారులూ ప్రజలను చైతన్యం చేయాలన్నారు.

బీసీ వెల్ఫేర్ అసోసియేషన్ గ్రేటర్ ఉపాధ్యక్షుడిగా సురేష్‌గౌడ్

అంబర్‌పేట: బీసీ వెల్ఫేర్ అసోసియేషన్ గ్రేటర్ ఉపాధ్యక్షుడిగా గోల్నాకకు చెందిన సురేష్‌గౌడ్ నియమితులయ్యారు. గురువారం ఈ మేరకు బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపీ ఆర్.కృష్ణయ్య ఆయన నియామకాన్ని ఖరారు చేశారు. ఈ సందర్భంగా సురేష్‌గౌడ్ మాట్లాడుతూ... బీసీల అభ్యున్నతికి తన వంతు కృషి చేస్తానన్నారు. తనకు అప్పగించిన బాధ్యతలను చిత్తశుద్ధితో నిర్వహిస్తానని తెలిపారు. తనకు బాధ్యతలు అప్పగించిన ఆర్.కృష్ణయ్యగా ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

టీహెచ్‌డీఏ ఉపాధ్యక్షుడిగా డా. దండెపు బస్వానందం



డా. బస్వానందంను సన్మానిస్తున్న జాతీయ కమిటీ ప్రతినిధులు శివమూర్తి, ఎన్వీ రావు

చిక్కడపల్లి: తెలంగాణ హోమియోపతి డాక్టర్స్ అసోసియేషన్ (టీహెచ్‌డీఏ) ఉపాధ్యక్షుడిగా డాక్టర్ దండెపు బస్వానందం ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా చిక్కడపల్లిలోని డాక్టర్ ఈశ్వరప్ప హోమియోపతి క్లినిక్‌లో గురువారం ఆయన మాట్లాడారు. హోమియోపతి వైద్యాన్ని మారుమూల గ్రామాల్లో సైతం ప్రజలకు అందుబాటులోకి తీసుకెళ్లడానికి కృషి చేస్తున్నానని తెలిపారు. హోమియోపతి వైద్యంతో రోగాలు ఆలస్యంగా నయమవుతాయనే అపోహలు ఉన్నాయని అన్నారు. హోమియోపతి వైద్యంతో రోగాలు త్వరగానే నయమవుతాయని తెలిపారు. దీర్ఘకాలిక రోగాలకు సైతం హోమియోపతిలో చికిత్స అందుబాటులో ఉందన్నారు. జాతీయ కమిటీ ప్రతినిధులు శివమూర్తి, ఎన్వీ రావు ఈ సందర్భంగా డా. దండెపు బస్వానందంను సన్మానించారు.

పేదల ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యం

చిక్కడపల్లి: పేదల ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యంను ఇస్తున్నట్లు ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ అన్నారు. రాంనగర్‌కు చెందిన జాక్సన్ అనారోగ్యంతో బాధపడుతూ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆయన చికిత్సకు సుమారు రూ.2.లక్షలు ఖర్చవుతుందని వైద్యులు తెలిపారు. అంత స్థోమత లేకపోవడంతో ఆయన కుటుంబీకులు ఎమ్మెల్యే ముఠా గోపాల్‌ను సంప్రదించారు. ఆయన వెంటనే వారితో సీఎంఆర్ఎఫ్‌కు దరఖాస్తు చేయించారు. ఈ మేరకు మంజూరైన రూ.2లక్షల ఎల్ఓసీ పత్రాన్ని గురువారం ఎమ్మెల్యే ముఠా గోపాల్ జాక్సన్ తల్లి ప్రభావతికి అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రావులపాటి మోజెస్, డా. గిడియోన్ బాబు, మధు తదితరులు పాల్గొన్నారు.

చుండూరు సుజాతకు జీవన సాఫల్య పురస్కారం

చిక్కడపల్లి: త్యాగరాయ గానసభలో 'అన్నమయ్య సంకీర్తన గానావళి'ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా గాయని చుండూరు సుజాత అన్నమయ్య సంకీర్తనలను ఆలపించి అందరినీ ఆశ్చర్య పరిచారు. గాయని చుండూరు సుజాత తన వయసును సైతం లెక్క చేయకుండా కొన్ని గంటల పాటు అన్నమయ్య సంకీర్తనలను ఆలపించడం గొప్ప విషయమని వక్తలు కొనియాడారు. తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ వారు చుండూరు సుజాతకు జీవన సాఫల్య పురస్కారం ప్రదానం చేసి సత్కరించారు.

గుడిపాటి వెంకటాచలం సాహిత్యానికి ప్రత్యేక స్థానం

చిక్కడపల్లి: త్యాగరాయ గానసభలో గురువారం రచయిత, సంఘ సంస్కర్త గుడిపాటి వెంకటాచలం యాదిలో... కార్యక్రమాన్ని నిర్వహించారు. విశిష్ట అతిథిగా పత్రిక సంపాదకులు పొత్తూరి సుబ్బారావు హాజరై మాట్లాడారు. 20వ శతాబ్దంలో మహిళల హక్కులు, స్వేచ్ఛ అంశాలుగా రచనలు చేశారని అన్నారు. ఆయన రచనలకు తెలుగు సాహిత్యంలో ప్రత్యేక స్థానం ఉందన్నారు. ఆయన రచనలు సామాన్యులకు సైతం అర్థమయ్యేలా ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళా జనార్దనామూర్తి, వెంకట్‌రెడ్డి, పీఎస్ఆర్ మూర్తి, రామ సుబ్రహ్మణ్యం, దేవసేన తదితరులు పాల్గొన్నారు.

హలో.. ఇక్కడ చెత్త వేయొద్దు..!



సీసీ కెమెరాలలో చూసి హెచ్చరిస్తున్న మైక్

- చడీ చప్పుడు కాకుండా చెత్తను వేయాలనుకున్నా వేయలేరు
- నిరంతర నిఘాతో చెత్త వేయకుండా మైక్ హెచ్చరికలు
- అంబర్‌పేట పరిధిలో ఆరు ప్రాంతాల్లో ఏర్పాటు
- రూ.10వేలు చెల్లిస్తే 'సీసీ కెమెరా విత్ మైక్' ఏర్పాటు చేస్తామంటున్న జీహెచ్ఎంసీ



గాంధీ విగ్రహం చౌరస్తా వద్ద సీసీ కెమెరాతో పాటు ఏర్పాటు చేసిన మైక్

అంబర్‌పేట: రహదారుల పక్కన, ఖాళీ స్థలాల్లో చెత్తాచెదారం వేయొద్దని హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసినా... అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నా తమకు అవేమీ పట్టవన్నట్లుగా కొందరు చెత్తను అలాగే వేస్తున్నారు. ఇలాంటి వారికి చెక్ పెట్టేందుకు... బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయకుండా కట్టడి చేసేందుకు జీహెచ్ఎంసీ వినూత్నంగా ఆలోచించింది. 'సీసీ కెమెరా విత్ మైక్'అనే అస్త్రాన్ని అందుబాటులోకి తీసుకొచ్చింది. ఎవరైనా చెత్త వేయడానికి వస్తే సీసీ కెమెరాలో పసిగట్టి ఇక్కడ చెత్త వేయొద్దని మైక్‌లో హెచ్చరిస్తుంది. ఈ సమయంలో చెత్త వేయాలనుకునే వారితో పాటు అటుగా వెళ్లే వారు సైతం అలర్ట్ అవుతున్నారు. దీంతో చెత్త వేయకుండా తమను తాము నియంత్రించుకుని పలాయనం చింతగిస్తున్నారు. అంబర్‌పేట నియోజకవర్గంలోని 5 ప్రాంతాల్లో 'సీసీ కెమెరా విత్ మైక్'ను జీహెచ్ఎంసీ ఏర్పాటు చేసింది. దీంతో చక్కని ఫలితాలు వస్తున్నాయని స్థానికులతో పాటు జీహెచ్ఎంసీ యంత్రాంగం పేర్కొంటున్నారు.

చెత్త వేసేవారిని గుర్తించి హెచ్చరించేలా..

◆ అంబర్‌పేట సర్కిల్ పరిధిలో ప్రధాన ప్రాంతాల్లో బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయకుండా కట్టడి చేసేందుకు జీహెచ్ఎంసీ సాంకేతికతను వాడుకుంటోంది. వెంటనే దానిని అమలులోకి తీసుకొచ్చింది. కాలనీలు, ప్రధాన కార్యాలయాలు, ప్రాంతాల్లో చెత్త వేయకుండా నిరోధించేందుకు సాంకేతికను రంగంలోకి దింపారు. చెత్త వేసే ప్రాంతాన్ని కవర్ చేసేలా సీసీటీవీ కెమెరాను ఏర్పాటు చేసి దానికి అనుసంధానంగా మైక్ అనౌన్స్‌మెంట్‌ను ఏర్పాటు చేసింది.

పనితీరు ఇలా..

◆ ఎవరైన సీసీ కెమెరా పరిధిలోకి రాగానే ''జాగ్రత్త.. మీరు సీసీ కెమెరాల్లో కనిపిస్తున్నారు.. ఇక్కడ చెత్త వేయొద్దు... వేస్తే జరిమానా వేస్తాం''అని మైక్ అనౌన్స్‌మెంటు వస్తుంది. దీంతో చెత్త వేసే వాళ్లు తమను గుర్తిస్తారని అక్కడ చెత్త వేయకుండా వెళ్లిపోతున్నారు. ఎక్కడైతే సీసీ కెమెరా విత్ మైక్ ఏర్పాటు చేశారో అక్కడ చెత్త వేయడం లేదనే విషయాన్ని అధికారులు గుర్తించారు. ఈ ఆలోచన మంచి సత్ఫలితాలను ఇస్తోందని పేర్కొంటున్నారు.

ప్రైవేటు వారి భాగస్వామ్యంతో...

◆ ఈ సాంకేతికతను జీహెచ్ఎంసీ ప్రైవేట్ వారి భాగస్వామ్యంతో చేపడుతోంది. చెత్త వేయకుండా పారిశుద్ధ్య సిబ్బంది కాపాల ఉండటం సాధ్యం కావడం లేదు. ప్రైవేటు వ్యక్తులు సైతం చెత్త వేయకుండా నిఘా వేయడం సాధ్యం కాదు. దీంతో సీసీ కెమెరా విత్ మైక్ ఆలోచనను అమలు చేస్తున్నారు. వ్యాపార సంస్థలు, ఇతర గృహాలు, కాంప్లెక్స్ యజమానులు, నిర్వాహకులు దీనిని ఏర్పాటు చేయించుకోవాలంటే జీహెచ్ఎంసీకి రూ.10వేలు రూసుము చెల్లించాల్సి ఉంటుంది.

ముందుకొస్తే ఏర్పాటు చేస్తాం..



సున్నిత ప్రాంతాల్లో చెత్త వేయకుండా నిరోధించడం తమకు కత్తి మీద సాములా ఉంది. ఎంత కాపాల పెట్టినా చెత్త వేయకుండా నిరోధించలేకపోతున్నాం. కొంత మంది ప్రైవేటు వ్యక్తులు, సంస్థలు ముందుకొచ్చి ఎలాగైనా మా పరిసరాల్లో చెత్త వేయకుండా నిరోధించాలని విజ్ఞప్తి చేయడంతో ఇలాంటి సాంకేతికతను అందుబాటులోకి తీసుకొచ్చాం. మైక్, సీసీ కెమెరాల కలిసి పనిచేయడంతో చెత్త వేయడం లేదు. దీనిని ఏర్పాటు చేయించుకోవాలనుకునే వారు ముందుకొస్తే ఏర్పాటు చేస్తాం.

– ఏఎంహెచ్ఓ డా. హేమలత, జీహెచ్ఎంసీ సర్కిల్–16

రెండు లక్షల ఉద్యోగాలను భర్తీ చేయాలి

తెలంగాణ విద్యార్థి జేఏసీ డిమాండ్



నిరుద్యోగుల నిరసన ర్యాలీని అడ్డుకోవడంతో నగర కేంద్ర గ్రంథాలయంలోనే నిరసన ప్రదర్శన

చిక్కడపల్లి: ఎన్నికల సమయంలో నిరుద్యోగులకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు రెండు లక్షల ఉద్యోగాలను భర్తీ చేయాలని తెలంగాణ విద్యార్థి జేఏసీ అధ్యక్షుడు ఏంఎల్ రాజుగౌడ్ డిమాండ్ చేశారు. రెండు లక్షల ఉద్యోగ సాధన కోసం గురువారం నగర కేంద్ర గ్రంథాలయం నుంచి నిరుద్యోగులు ర్యాలీ చేపట్టారు. ఈ క్రమంలో చిక్కడపల్లి పోలీసులు వారిని అడ్డుకోవడంతో గ్రంథాలయంలోనే ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జేఏసీ అధ్యక్షుడు రాజుగౌడ్ మాట్లాడుతూ... అధికారంలోకి వస్తే మొదటి ఏడాదిలోనే రెండు లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తామన్న కాంగ్రెస్ ఇప్పటి వరకు భర్తీ చేయలేదన్నారు. జాబ్ కేలండర్ ఏమైందని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. తూతూ మంత్రంగా ఉద్యోగాల భర్తీకి చర్యలంటూ ఓ కేలండర్‌ను ప్రకటించిందని విమర్శించారు. అందులో ఎన్ని ఉద్యోగాలు ఖాళీ ఉన్నాయో... ఎంత కాలానికి ఎన్ని ఉద్యోగాలు భర్తీ చేస్తారో కనీస ప్రస్తావన లేదని తెలిపారు. నిరుద్యోగులకు ఇచ్చిన హామీని అమలు చేయకుండా ప్రభుత్వం మోసం చేస్తోందని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలలోపే ఉద్యోగ నోటిఫికేషన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో జేఏసీ నాయకులు నరేష్, మహేష్, సతీష్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేద్దాం



బంద్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వామపక్షాల నేతలు

ముషీరాబాద్: విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని ఈనెల 23న తలపెట్టిన రాష్ట్ర వ్యాప్త విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయాలని పీడీఎస్‌యూ హైదరాబాద్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మందనవీన్, కంచనపల్లి శ్రీనివాస్ అన్నారు. ఈ మేరకు గురువారం మార్క్స్ భవన్‌లో నిర్వహించిన సమావేశంలో బంద్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. విద్యార్థులు పెద్ద సంఖ్యలు పాల్గొని బంద్‌ను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ హైదరాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి చైతన్య, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు లెనిన్, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాకేష్, హరీష్, నాయకులు కె.గణేష్, నాగేంద్ర, గౌతమ్, ఆసిఫ్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం తలెత్తకుండా చర్యలు



అశోక్‌నగర్‌లో విద్యుత్ సమస్యలను తెలుసుకుంటున్న మెట్రో జోన్ సీఈ సాయిబాబా

చిక్కడపల్లి: విద్యుత్ సరఫరాలో అంతరాయం తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని టీజీఎస్పీడీసీఎల్ మెట్రో జోన్ సీఈ సాయిబాబా అన్నారు. గురువారం అశోక్‌నగర్, గాంధీనగర్, దోమలగూడ తదితర ప్రాంతాలలో ఆయన సెంట్రల్ ఎస్ఈ వెంకన్న, డీఈ నెహ్రూనాయక్, ఇందిరా పార్క్ ఏడీఈ సంపత్, అశోక్‌నగర్ ఏఈ గోపాలకృష్ణ, సిబ్బందితో కలసి పర్యటించారు. విద్యుత్ సరఫరా ఏ విధంగా జరుగుతుందని వినియోగదారులను నేరుగా అడిగి తెలుసుకున్నారు. విద్యుత్‌లో బిల్లింగ్, వోల్టేజ్‌లో హెచ్చుతగ్గులు, వైరింగ్ వేలాడుతున్న సమస్యలను తెలుసుకున్నారు. వర్షాకాలంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. విద్యుత్ సమస్యలు ఉంటే వెంటనే ఉన్న టోల్‌ఫ్రీ నంబర్ 1912లో చెప్పాలని కోరారు.


నియోజకవర్గంలో కమ్యూనిటీహాళ్ల ఆధునీకరణ



పీఅండ్‌టీకాలనీ కమ్యూనిటీహాల్ ముఖద్వార నిర్మాణ పనులకు పూజలు చేస్తున్న ఎమ్మెల్యే

ముషీరాబాద్: ముషీరాబాద్ నియోజకవర్గం స్థానిక ప్రజలకు శుభకార్యాలు, సభలు, సమావేశాలు నిర్వహించుకునేందుకు ప్రతి కాలనీ, బస్తీలలో కమ్యూనిటీహాల్స్‌ను నిర్మిస్తున్నామని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ తెలిపారు. గురువారం భోలక్‌పూర్ డివిజన్‌లోని పీఅండ్‌టీ కాలనీలో రూ.30 లక్షలతో చేపట్టిన కమ్యూనిటీ హాల్ ముఖద్వార నిర్మాణ పనులకు పూజలు చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... పీఅండ్‌టీకాలనీ కమ్యూనిటీహాల్ చాలా రోజులుగా పెండింగ్‌లో ఉందన్నారు. త్వరితగతిన నిర్మాణ పనులు పూర్తి చేయాలని సంబంధిత కాంట్రాక్టర్‌కు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ముఠా జైసింహా, బింగి నవీన్, శంకర్‌గౌడ్, గోవింద్‌రాజ్, కాలనీ అధ్యక్ష, కార్యదర్శులు రామకృష్ణ, లత తదితరులు పాల్గొన్నారు.

బూస్టర్ ఏర్పాటుతో లోప్రెషర్ సమస్యకు చెక్



వినాయక్‌నగర్ బూస్టర్ ఏర్పాటు పనులను పరిశీలిస్తున్న వాటర్ వర్క్స్ మేనేజర్ సుప్రజ

కవాడిగూడ: వినాయకనగర్‌లో నెలకొన్న లోప్రెషర్ నీటి సరఫరాను అరికట్టేందుకు నూతనంగా బూస్టర్ ఏర్పాటు చేసినట్లు దోమలగూడ సెక్షన్ మేనేజర్ సుప్రజ అన్నారు. కొంతకాలంగా లోప్రెషర్ నీటి సరఫరాతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని స్థానికులు వాటర్ వర్క్స్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన మేనేజర్ సుప్రజ నీటి సరఫరాలో ప్రెషర్ పెంచేందుకు బూస్టర్ ఏర్పాటు చేస్తున్నట్లు ఆమె తెలిపారు. ఈ మేరకు గురువారం బూస్టర్ ఏర్పాటు పనులను బీజేపీ నాయకులు జి.వెంకటేష్, పి.పరశురాం, సలంద్రి దిలీప్‌యాదవ్ తదితరులు పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానికులు వాటర్ వర్క్స్ అధికారులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: అజామాబాద్ డివిజన్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల నిమిత్తం పలు ప్రాంతాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏడీఈ నాగేశ్వరరావు తెలిపారు. నెహ్రూనగర్ ఫీడర్ పరిధిలోని నెహ్రూనగర్, కృష్ణానగర్, గోల్నాక చర్చ్ తదితర ప్రాంతాల్లో ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు.... సుందర్‌నగర్ ఫీడర్ పరిధిలోని సుందర్‌నగర్, దుర్గానగర్, డంపింగ్ యార్డ్ తదితర ప్రాంతాల్లో ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు... సీసీ షెరాఫ్ ఫీడర్ పరిధిలోని సీసీ షెరాఫ్ ఆస్పత్రి, భూమన్న గల్లీ, రాజేంద్రనగర్ కాలనీ, బాగ్‌లింగంపల్లి, కాచిగూడ రైల్వేస్టేషన్ తదితర ప్రాంతాల్లో మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

రేపు జాబ్ మేళా

కాచిగూడ: నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు భారత్ సేవ కేంద్రం ఆధ్వర్యంలో ఈనెల 19వ తేదీన జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ అడప వెంకట్‌రెడ్డి తెలిపారు. ఇంటర్, డిగ్రీ, పీజీ, ఎంబీఏ అర్హత కలిగిన నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. పంజాగుట్ట ద్వారకాపురి కాలనీలోని రాజేశ్వరి టవర్స్‌లో శనివారం ఉదయం 11 నుంచి 4గంటల వరకు జాబ్ మేళా కొనసాగుతుందన్నారు.

తక్కువ సమయంలో ఎక్కువ సంపాదించాలనే ఆశతో..

చిక్కడపల్లి: ద్విచక్ర వాహనాల చోరీలకు పాల్పడుతూ తప్పించుకు తిరుగుతున్న ఓ వ్యక్తిని చిక్కడపల్లి పోలీసులు గురువారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కర్నూలు నగరానికి చెందిన కుడుముల మధుసూదన్‌రెడ్డి(44) ప్రస్తుతం కడప జిల్లా యర్రగుంట్ల గ్రామంలో నివాసముంటున్నాడు. తక్కువ సమయంలో ఎక్కువ డబ్బును సంపాదించాలనే ఆశతో నగరానికి వచ్చి చోరీలకు పాల్పడుతున్నాడు. చిక్కడపల్లి, దోమలగూడ ఠాణాల పరిధిలో రెండు బైక్‌లు, తిరుచానూర్, ఈస్ట్ తిరుపతి ఠాణాల పరిధిలో రెండు బైక్‌లను దొంగలించారు. జవహర్‌నగర్ ఎస్సార్టీలో రాంబాబు అనే వ్యక్తి ఈనెల 10వ తేదీన ఇంటి ముందు బైక్ పార్క్ చేశాడు. తిరిగి వచ్చేసరి తన ద్విచక్రవాహనం కనిపించలేదు. వెంటనే చిక్కడపల్లి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. డీఐ శంకర్ మలోతు, ఎస్ఐ ఎల్ మౌనిక నేతృత్వంలో బృందం సీసీ ఫుటేజీలను జల్లెడ పట్టారు. అనుమానంగా కనిపించిన ప్రతి ఒక్కరిని విచారించారు. ఈ క్రమంలో మధుసూదన్‌రెడ్డి అనే వ్యక్తి చోరీలకు పాల్పడుతున్న విషయాన్ని గుర్తించారు. అతడి వద్ద నుంచి నాలుగు బైక్‌లను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు.

పండగను భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవాలి



బోనాల ఉత్సవ నిర్వాహకుల సమావేశంలో మాట్లాడుతున్న ఏసీపీ హరీష్‌కుమార్

అంబర్‌పేట: బోనాల పండగను భక్తిశ్రద్ధలతో శాంతియుతంగా నిర్వహించుకోవాలని కాచిగూడ డివిజన్ ఏసీపీ హరీష్‌కుమార్ సూచించారు. అంబర్‌పేట సీపీఎల్ రోడ్ కేకే ఫంక్షన్‌హాల్‌లో బోనాల ఉత్సవాల నిర్వాహకులతో గురువారం ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. పండగల సంస్కృతి మారేలా ఉత్సవాలు నిర్వహించొద్దని ఆయన కోరారు. పండుగల సంస్కృతి, సంప్రదాయం, సందేశం వంటి అంశాలను పరిగణలోకి తీసుకునిఆ నిర్వహించుకోవాలన్నారు. పండగల నిర్వహణలో దాగి ఉన్న సంస్కృతిని భావితరాలకు తెలిసేలా చేపట్టుకోవాలని కోరారు. పండగలను సాకుగా చేసుకుని గొడవలకు దిగొద్దని సూచించారు. శాంతి భద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఎలాంటి వదంతులు నమ్మకుండా అమ్మవారికి బోనాలను సమర్పించాలన్నారు. ప్రతి అమ్మవారి ఆలయం వద్ద తమ సిబ్బంది బందోబస్తుగా ఉంటారని తెలిపారు. ఆలయ నిర్వాహకులతో పాటు భక్తులు వారికి సహకరించాలని కోరారు. సమస్యల తలెత్తితే పోలీసుల దృష్టికి తీసుకురాలే తప్ప చట్టాన్ని ఎవరూ చేతిలోకి తీసుకోవద్దని సూచించారు. ఈ సమావేశంలో పలు ఆలయాల నిర్వాహకులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుద్దీపాల తోరణాలు

లియో లైటింగ్ కమాన్‌ల వెలుగులో చెప్పల్‌బజార్



కాచిగూడ: ఆషాఢమాస నింబోలిఅడ్డ బోనాలను పురస్కరించుకొని చెప్పల్‌బజార్ ప్రధాన రహదారిని రంగురంగుల విద్యుద్దీపాల తోరణాలతో అలంకరించారు. ప్రతి 50 అడుగులకు ఒక తోరణాలు ఏర్పాటు చేశారు. అందులో అమ్మవారి రూపం కనిపిస్తూ అందిరినీ అకట్టుకుంటున్నాయి. ఈనెల 20, 21వ తేదీల్లో జరిగే బోనాల వేడుకలకు లియో లైటింగ్ కమాన్‌లను ఏర్పాటు చేశామని కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్‌యాదవ్ తెలిపారు. ఈ తోరణాలను గురువారం రాత్రి ఆమె పరిశీలించి లియో లైటింగ్‌ను ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ... యూత్ ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగే బోనాల వేడుకలకు కేంద్రమంత్రులు జి.కిషన్‌రెడ్డి, బండి సంజయ్, ఓబీసీ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కె.లక్ష్మణ్, రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు, హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు లంకల దీపక్‌రెడ్డి, డాక్టర్ ఎస్.గౌతంరావు, వివిధ పార్టీల నేతలు, ప్రజా ప్రతినిధులు హాజరవుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో రవియాదవ్, సుదీర్, ప్రవీణ్, చందు యాదవ్, శ్రీమంత్, భీమ్‌రాజ్, గ్రేస్, నర్సింగ్‌రావు, శ్రవణ్ యాదవ్, సురేష్ యాదవ్, మల్లికార్జున్, తదితరులు పాల్గొన్నారు.

బోనాల నేపథ్యంలో ఆలయాల వద్ద హెల్త్ క్యాంపులు



ముషీరాబాద్: త్వరలో జరగనున్న బోనాల ఉత్సవాల సందర్భంగా సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రతి అమ్మవారి దేవాలయం వద్ద వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నామని అంబర్‌పేట క్లస్టర్ డాక్టర్ బి.పద్మజ తెలిపారు. గురువారం ముషీరాబాద్ ప్రభుత్వ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బోనాల పండుగను పురస్కరించుకుని రివ్యూ మీటింగ్ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ పద్మజ మాట్లాడుతూ... నియోజకవర్గంలోని 16 ప్రధాన అమ్మవారి ఆలయాలతో పాటు బస్తీలు, కాలనీలలో హెల్త్ క్యాంపులు ఏర్పాటు చేయాలని సూచించారు. అత్యవసర వైద్య సేవలు అందించేందుకు మెడికల్ కిట్‌లు అందుబాటులో ఉంచాలన్నారు. ఈ కార్యక్రమంలో ముషీరాబాద్ యూపీహెచ్‌సీ వైద్యాధికారి డా. మనోజ్‌రెడ్డి, డా. దీప్తిపటేల్, డా. మౌనిక, డా. హరిశ్రీ, డా.కౌశర్, డా. హాసిని, డా. శివ, డా. జులాని తదితరులు పాల్గొన్నారు.

బోనాలను వైభవంగా నిర్వహిస్తాం

- కనకాల కట్టమైసమ్మ ఆలయ బోనాల బ్రోచర్ ఆవిష్కరణ
- ఆలయంలో 20న బోనాలు, 21న రంగం
- భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు
- ఆలయ కమిటీ ఫౌండర్ ట్రస్టీ చైర్మన్ గౌతమ్‌కుమార్ పటేల్



కవాడిగూడ: భక్తుల కోర్కెలు తీర్చే లోయర్ ట్యాంక్‌బండ్‌లోని కనకాల కట్టమైసమ్మ బోనాలు అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు అన్ని రకాల ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఈనెల 20న బోనాలు, 21న సాయంత్రం రంగం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఫౌండర్ చైర్మన్ గోల్కొండ గౌతమ్‌కుమార్ పటేల్, ఆలయ ఈవో సాంబశివరావు, ప్రధాన అర్చకులు సాత్విక్ శర్మ, సీనియర్ అసిస్టెంట్ సత్యనారాయణ పేర్కొన్నారు. కనకాల కట్టమైసమ్మ దేవాలయంలో గురువారం బోనాల ఉత్సవాల బ్రోచర్‌ను వారు ఆవిష్కరించి మాట్లాడారు. బోనాలను వైభవంగా నిర్వహిస్తామని అన్నారు. బోనాలు సమర్పించేందుకు వచ్చే భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేశామని పేర్కొన్నారు. భక్తుల కోసం సమీపంలో ఉన్న ఖాళీ స్థలంలో తాత్కాలిక షెడ్లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఆలయానికి భక్తులకు తీర్థప్రసాద వితరణ కూడా ఉంటుందన్నారు. ప్రశాంత వాతావరణంలో బోనాల పండగ నిర్వహించుకునేలా భక్తులు సహకరించాలని వారు కోరారు.

బోనాల ఏర్పాట్లపై ఒక్క సమావేశం నిర్వహించలేదు..

ఎంతో చరిత్ర ఉన్న కట్టమైసమ్మ ఆలయ బోనాల జాతర ఏర్పాట్లపై స్థానిక ఎమ్మెల్యే ముఠా గోపాల్, కార్పొరేటర్ రచనశ్రీ అధికారులతో సమీక్ష సమావేశాలు నిర్వహిస్తారు. కానీ ఈసారి దేవాదాయ, జీహెచ్ఎంసీ, విద్యుత్, పోలీసు శాఖ అధికారులతో ఒక్క సమావేశం కూడా నిర్వహించకపోవడం గమనార్హం. ఆలయ కమిటీ నిర్వాహకులు ఎలాంటి హంగు ఆర్భాటం లేకుండానే బోనాల ఉత్సవాల బ్రోచర్‌ను ఆవిష్కరించారు.